క్లుప్తంగా

సమానత్వమే ఇస్లాం



మాట్లాడుతున్న ఖసీబ్ హిందుస్థాన్ మౌలానా అహ్మద్ నక్షాబంది

ఆత్మకూరు : ప్రపంచంలో ప్రతి ఒక్కరూ అన్న దమ్ములుగా కలిసి ఉండాలని ఇస్లాం సమానత్వ సందేశానిస్తుందని ఖసీబ్ హిందుస్థాన్ మౌలానా అహ్మద్‌నక్షాబంది అన్నారు. పట్టణంలోని ఎండబ్ల్యూ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం అహ్లే సున్ని జమాత్ ఇస్తేమా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇస్లాం అంటేనే శాంతిని బోధిస్తుందని, అందరూ ప్రశాంత జీవనం కొనసాగించాలని సందేశమిస్తుందన్నారు. సర్వమతాల వారు కలిసిమెలసి జీవించాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ ఫసిపుల్ మున్నా, సయ్యద్, ఖాదర్, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్‌అహ్మద్, ఫరుక్, హబీబ్ పాల్గొన్నారు.

దుప్పి మాంసం లభ్యం



కుప్పలుగా వేసిన దుప్పి మాంసం

వెలుగోడు: నల్లమల అరణ్యంలో వన్య ప్రాణులకు రక్షణ కరువైంది. వేటగాళ్ల చేతిలో వన్య ప్రాణులు మృత్యువాతపడుతూనే ఉన్నాయి. బుధవారం దుప్పి మాంసం విక్రయిస్తుండగా అటవీ అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. పట్టణ శివారులోని చిన్న చెరువు సమీపంలో మామిడి తోట వద్ద 5 దుప్పి పిల్లల మాంసం లభ్యమైంది. 4 నెలల వయసు దుప్పి పిల్లలను చంపి వాటి మాంసం విక్రయించేందుకు కుప్పలుగా వేయగా సమాచారం మేరకు రైంజర్ పట్టాభి ఆధ్వర్యంలో అటవీ అధికారులు దాడులు చేశారు. దీంతో వేటగాళ్లు పరారు అయ్యారు. దుప్పి పిల్లలకు పశువైద్యాధికారులు జుబేర్, వెస్లీ పోస్టు మార్టం చేసి అంత్య క్రియలు నిర్వహించారు. దాడుల్లో ఎఫ్‌ఎస్‌వోలు శ్రీనివాసులు, శివనాగయ్య, శ్రీనివాసులు, ఎఫ్‌బీవో ఈదన్న తదితరులు పాల్గొన్నారు.

పెయ్యదూడల ప్రదర్శన



పెయ్య దూడలను పరిశీలిస్తున్న డా. రాజశేఖర్

పాములపాడు: పెయ్య దూడలను శాస్త్రీయ పద్ధతిలో పోషిస్తే ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా లైవ్‌స్టాక్ డెవలప్‌మెంటు ఏజెన్సీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని వేంపెంట పశు వైద్య కేంద్రపరిధిలోని ఎర్రగూడూరు గ్రామంలో పెయ్యదూడల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 60 పెయ్య దూడలతో 40 మంది రైతులు పాల్గొన్నారు. పెయ్యదూడలను పరిశీలించిన అధికారులు విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతి గోపాల్‌నాయక్, రెండో బహుమతి వెంకటయ్య, మూడో బహుమతి ఎల్లప్పలకు అందజేశారు. కార్యక్రమంలో వెలుగోడు ఏడీపీ ధనుంజయ, డాక్టర్ భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు ముందుకురావాలి



ఇంటి నిర్మాణాల కోసం తీసిన పూనాదులను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ, ఎంపీడీఓ

కొత్తపల్లి: జగనన్న ఇళ్ల స్థలాల లేఅవుట్లలో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రావాలని హౌసింగ్ డీఈ ప్రభాకర్, ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం కొత్తపల్లి జగనన్న ఇళ్ల స్థలాల్లో లబ్ధిదారులు తీసుకుంటున్న పునాదులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ కొత్తపల్లిలో 105 మంది లబ్ధిదారుల పేర్లు మంజూరు కాగా ఇందులో ముందుగానే కట్టించుకొన్నవి 18 పోగా 89 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేసుకునేందుకు అనుమతులు వచ్చాయన్నారు. అందులో 73 మంది లబ్ధిదారులు గృహాలు నిర్మించు కునేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. వీటిలో 46 మందితో జియోట్యాగింగ్ పూర్తి చేయించామన్నారు. వీరితో పాటు ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

పాములపాడు: మండలంలోని వాడాల గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు బుధవారం సిబ్బందితో వెళ్లి దాడి నిర్వహించినట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. పేకాట ఆడుతున్న నందికొట్కూరుకు చెందిన దాసు, ప్రసాద్, మన్సూర్, వీపనగండ్ల స్వాములు, తుమ్మలూరుకు చెందిన గోవిందులను అరెస్టు చేశామన్నారు. కాగా మరి కొందరు పరారైనట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.28,080 నగదుతో పాటు రెండు మోటారు బైక్, 2 ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడిలో హెడ్‌కానిస్టేబుల్ ఎర్రన్న, కానిస్టేబుళ్లు యాగంటి, టవేశ్వర్, ఖాజా, రసూల్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అడవి దాటిన పెద్దపులి!

గతేడాది మైదాన ప్రాంతంలో 25 కిమీ రికార్డు స్థాయిలో తిరుగాడిన వైనం

- ఇటీవల గ్రామాల పరిసరాల్లో పెద్దపులుల సంచారం
- జీవావసరాల కోసమే వస్తుందంటున్న అధికారులు



ఆత్మకూరురూరల్: పంట పొలాల్లో పులి సంచారం ... రోడ్డును దాటిన పెద్దపులి ... ఫలానా ఊరి శివార్లలో పులి కలకలం... ఇవన్ని ఇటీవల వార్తా పత్రికల్లో శీర్షికలు. గత రెండు మూడు రోజులుగా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. నల్లకాలువ సమీపంలో పొలంలో ఆదివారం రాత్రి ఓ రైతుకు చెందిన ఆవుపై దాడి చేసి చంపివేసింది. మంగళవారం పాములపాడు మండలంలోని బానుముక్కల గ్రామంలో గ్రామస్తులకు పెద్ద పులి కనిపించింది. అడవుల్లో ఉండాల్సిన పులి గ్రామాల్లో, మైదానాల్లో, రహదారులపై పులి ఎందుకు తిరుగుతుంది? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

పులి అడవిని వదలడానికి కారణాలివి

పెద్దపులి ప్రపంచ వ్యాప్తంగా తరిగిపోతున్న జీవుల్లో ఒకటి. ఇది విలుప్తమవ్వ బోయే జీవిగా రెడ్‌డాటా పుస్తకంలోకి కూడా చేరింది. ఇందుకు కారణం పులి ఆవాసాల తరుగుదల, పులి ఆహార జంతువుల నిష్పత్తిలో తరుగుదల ప్రధానమైనవి. ఎంతో బలమైన జంతువుగా చెప్ప బడే పెద్దపులి తన ఆహార జంతువులను పరుగెత్తి వెంటాడి అందుకోలేదు. మాటు వేసి ఒక్కసారిగా ఆ జంతువుపై దూకడం ద్వారానే ఆహార జంతువును చంపుతుంది. ఈ కారణంగానే పులికి సహజంగా ఆహార లభ్యత చాలా తక్కువ. ఐదు సార్లకు ఓ మారుగాని పులి దాడులు సఫలం కావు. ఈ కారణంగానే పెద్ద పులులు సులభ లభ్య ఆహార జంతువుల కోసం (బర్రె, ఆవు, ఎద్దు వంటి) ప్రయత్నం చేస్తాయి. అడవుల్లోకి మేత కోసం వచ్చే డొమెస్టిక్ జంతువులను పులులు వెంటాడి వేటాడుతుంటాయి. ఈ నేపథ్యంలోనే ఆహార జంతువును వెంటాడుతూ అడవిని దాటి బయటకు కూడా వస్తాయి. పంటపొలాల్లో ఉండే అడవి పందుల వంటి జంతువుల ఉనికిని పసిగట్టిన పుడు కూడా పులుల ప్రయాణం గ్రామాల వైపు సాగుతుంది.

ఆవాసం, ఆహారం కోసం..

పులుల జీవన వ్యవహారం మొత్తం సంఘర్షణల మయం. ఆవాసం కోసం, ఆహారం కోసం, జత కోసం పులులు పోరాటం సాగించాల్సిందే. పులులు తమ ఆహార లభ్యతను బట్టి 40 చ.కిమీ పరిధిని తన టెరటరీగా ప్రకటించుకుంటుంది. టెరటరీని ఇతర పులులతో పోరాటం చేసి విజయవంతమైన తరువాతే పొందుతుంది. ఆ పోరాటంలో పరాజయం పాలైన పులి తన ఆవాసం కోసం కొత్త ప్రాంతాన్ని చూసుకొని కొత్త పోరాటాన్ని ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పులులు అప్పుడప్పుడు అడవిని దాటి బయటకు వస్తుంటాయి. అలాగే ఆహారం కోసం, తన జతకోసం భాగస్వామిని వెతుకుతున్న సందర్భంలోనూ బయటకు రావడం జరుగుతుంటుంది.

25 కిమీ మైదాన ప్రాంతాల్లో తిరిగిన పెద్దపులి

ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో ఒక పెద్దపులి గతేడాది 25 కిమీ దూరం మైదాన ప్రాంతాల్లో తిరుగి నల్లమల అడవుల్లోకి వెళ్లింది. ఇది ఓ రకంగా రికార్డే. ఇది వెలుగోడు నార్త్ బీట్ నుంచి బయటకు వచ్చి పాములపాడు మండలం బానకచర్ల, ఎర్రగూడూరుల మీదుగా కొత్తపల్లె మండలం ఎం. లింగాపురం, కొత్తపల్లె, బండినాయుని పాలెంల మీదుగా ఆత్మకూరు మండలంలోని కొట్టాల చెర్వు వద్ద తిరిగి అడవిలోకి ప్రవేశించింది. ఈ మొత్తం వ్యవహారంలో పెద్దపులి ఎక్కడా మనుషులపై దాడికి పాల్పడిన ఘటన రికార్డు కాలేదు.

పులి మనుషులపై దాడి చేయదు



పులులు తమ జీవ అవసరాలకోసమే అప్పుడప్పుడు అడవి బయటకు వస్తుంటాయి. అవి అడవుల్లో కానీ, మైదాన ప్రాంతాల్లో సాధారణ పరిస్థితుల్లో మనుషులపై దాడి చేయవు. మనిషిలా రెండు కాళ్లపై నిటారుగా సంచరించే జీవి. రెండు కాళ్ల జంతువులు పులి ఆహార మెనూలో లేవు. కాబట్టి భయంతో వాటికి హాని చేసే పనులు చేయవద్దు. పులి పర్యావరణ పిరమిడ్‌లో అగ్రసూచి. పులి మనుగడకు అనుకూలంగా లేని భూమిపై మనిషి మనుగడ కూడా ప్రశ్నార్థకమే అవుతుంది.

– ఎం. పట్టాభి, ఎఫ్ఆర్ఓ ,ఆత్మకూరు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ఆదర్శ పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి

పగిడ్యాల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి, భూషిరెడ్డిలు బుధవారం ఆదర్శ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఈనెల 13న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని, వెన్నపూసను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నారని స్థానిక సంస్థలు, ఉపాధ్యాయ, ఎమ్మెల్యేల కోటా, పట్టభద్రులకు నిర్వహించే ఎన్నికల్లో 18 స్థానాలు ఉండగా అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకే 14 స్థానాలను కేటాయించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వెన్నపూసకే

కొత్తపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కె.సుధాకర్ రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా పింఛన్ల పండుగ

- పంపిణీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు
- నియోజకవర్గంలో 85 శాతం పంపిణీ



జూటూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా : నందికొట్కూరు నియోజకవర్గంలో మార్చినెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం బుధవారం పండుగలా సాగింది. బుధవారం తెల్లవారకముందే వలంటీర్లు అవ్వా, తాతల తలుపు తట్టి పింఛన్ మొత్తాన్ని చేతిలో పెట్టారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు గ్రామవలంటీర్లతో కలసి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని నందికొట్కూరు పట్టణం, అర్బన్, మిడుతూరు, పాములపాడు, కొత్తపల్లి, జూపాడుబంగ్లా, పగిడ్యాల, మండలాల పరిధిలో మార్చి నెలకు గాను రూ.35,324 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓలు శోభారాణి, మంజులవాణి తెలిపారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఆయా గ్రామాల్లోని గృహసారథులు పర్యవేక్షించటంతో పాటు దగ్గరుంచి లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేయించారు. సాయంత్రం ఐదు గంటలకు మండలాల్లో సగటున 82శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తైనట్లు అధికారులు తెలిపారు.

కొత్తపల్లిలో 72.35 శాతం

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో గ్రామవలంటీర్లు బుధవారం 72.35 శాతం మంది లబ్ధిదారులకు మార్చినెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేశారని ఎంపీడీఓ మేరి తెలిపారు. శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సుగురు రవణమ్మ, గుమ్మడాపురం సర్పంచు నక్క విజయ్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాయిరామ్, రాములు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు అన్ని గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ముందుకు సాగారు.

క్షయ వ్యాధిపై అవగాహన ఉండాలి

పాములపాడు: క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఇస్కాల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలుంటే వెంటనే పరీక్ష లు చేయించాలన్నారు. హెచ్ఎం వేదవతి, ఉపాధ్యాయ సిబ్బంది, యంఎల్‌హెచ్‌పీ సింధూర పాల్గొన్నారు.

భూ సర్వే పకడ్బందీగా చేయండి

జూపాడుబంగ్లా: సమగ్ర భూసర్వే పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని తర్తూరు, మండ్లెం గ్రామాల్లో సమగ్రభూ సర్వేను పరిశీలించారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి వారి వద్ద ఉన్న వివరాలు, ఆన్‌లైన్లో ఉన్న వివరాలను సరిచూశారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతుల సమక్షంలో పొలాలను పరిశీలించి పొలం యజమాని, అనుభవంలో ఉన్న వారి వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు శ్రీరంగారెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో శనగ కొనుగోళ్లు ప్రారంభం

జూపాడుబంగ్లా: రైతులు పండించిన శనగలను ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో శనగలు క్వింటా రూ.4,400 ధర పలుకుతున్నందున రైతులకు గిట్టుబాటు కావడం లేదన్నారు. దీంతో ప్రభుత్వం క్వింటాలుకు రూ.5,335ల ప్రకారం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రైతులు ఈక్రాప్‌తో పాటు శనగల విక్రయానికి పేర్లు ఆర్బీకేల్లో నమోదు చేసుకున్నట్లు తెలిపారు. పేర్లు నమోదు చేసుకొన్న రైతుల సెల్‌ఫోన్లకు ఇప్పటికే దాన్యం కొనుగోలు సమాచారం పంపించినట్లు వెల్లడించారు. జూపాడుబంగ్లా మండలంలో 7, కొత్తపల్లిలో 9, మిడుతూరులో 14, పగిడ్యాలలో 10, పాములపాడులో 13, నందికొట్కూరులో 14 చొప్పున శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొనుగోలు ప్రారంభించాలని ఆదేశాలు జారీచేసినప్పటికీ ఖాళీ సంచుల కొరతవల్ల కొనుగోళ్లు ప్రారంభించలేదని మార్క్‌ఫెడ్ మేనేజర్ తెలిపారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తనీయొద్దు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

పగిడ్యాల: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య ఎంపీడీఓ వెంకటరమణను కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు అజెండా ప్రకారం ప్రగతి నివేదికలను వెల్లడి చేశారు. అయితే అటవీ, ఎక్సైజ్, ఆర్అండ్‌బీ, మత్స్యశాఖ, ట్రాన్స్‌కో అధికారులు గైర్హాజరు కావడంపై జిల్లా కలెక్టర్‌కు రిపోర్టు పంపుతామన్నారు. అలాగే ఆరోగ్యం, నీటి పారుదల శాఖ అధికారులకు బదులు కింది స్థాయి అధికారులు హాజరు కావడంపై మండిపడ్డారు. పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చిన మొబైల్ వాహన సేవలు ప్రశంసనీయమని, ఏ రాష్ట్రంలో ఇలాంటి పథకాలు అమలు కాలేదని ఎంపీపీ ప్రశంసలు కురిపించారు. 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే వాహనం మీ ముంగిట్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్, ఈఓఆర్డీ పుల్లయ్య, ఏఈలు వెంకటేశ్వర్లు, శివకుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని 27వ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల కోసం శ్లోకా స్కూల్ కరస్పాండెంట్ రాగిపిండి, పెసలు, అలసందలు, చిక్కీలు, అరటిపండ్లను కేంద్రం నిర్వాహకురాలు పుష్పలతకు అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆశీర్వాదమ్మ, సచివాలయ మహిళా పోలీసు భవితరోషన్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌కు ప్రశంసా పత్రం

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ మహబుబ్‌బాషా సేవలకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. రాష్ట్ర కమిషనర్ నుంచి మహబుబ్‌బాషాకు ప్రశంసా పత్రం లభించింది. ఇటీవల ఆయన మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసి సేవలు అందించారు. దాదాపు 3,500 మందికి ఆధార్ అప్డేట్, ఇతర సేవలు చేయడంతో ప్రశంసా పత్రం లభించింది.

సమస్యల్లేకుండా చేయండి

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎక్కడా తాగునీరు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 7 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

పండ్లు, పూల తోటల పెంపకంలో రాణించాలి

జూపాడుబంగ్లా: ప్రభుత్వం అందజేస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకొని రైతులు హైబ్రీడ్ పండ్ల తోటలు, పూల తోటల పెంపకంలో రాణించాలని హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని అన్నారు. బుధవారం ఆమె మండలంలోని తంగెడంచ గ్రామంలో బొప్పాయి, మల్లె తోటల పెంపకాన్ని పరిశీలించారు. ఆమె రైతులకు తోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సాగునీటి వనరులు, చెరువుల కింద తోటల పెంపకంతో ప్రభుత్వం 75శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. హెక్టారు కూరగాయలు సాగుచేసుకొనే రైతులకు రూ.20 వేలు, పూల తోటలు సాగుచేసుకొనే వారికి రూ.16వేల చొప్పున రాయితీ లభిస్తుందన్నారు. హెక్టారులో అరటి సాగుకు రూ.30,739, బొప్పాయి రూ.18,497లు, చీని, నిమ్మకు రూ.9,602లు, డ్రాగన్ ఫ్రూట్స్‌కు రూ.30వేలు, జామ రూ.16వేల చొప్పున రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్న కారు రైతులకు జాతీయ ఉపాధిహామీ పథకం కింద దరఖాస్తు చేసుకొని రాయితీ పొందవచ్చునన్నారు. ఐదు ఎకరాలు పైబడి పొలం ఉన్న రైతులు ఉద్యాన వనశాఖ తరుపున దరఖాస్తు చేసుకొని రాయితీలు పొందవచ్చని తెలిపారు.

టీషర్టుల కోసం ఘర్షణ

మహానంది: తిమ్మాపురంలో కబడ్డీ ఆటకు సంబంధించిన టీ షర్టుల విషయంలో కొంత మంది యువకుల మధ్య మంగళవారం రాత్రి గొడవ చోటుచేసుకోగా ఒకరికి గాయాలైనట్లు మహానంది పోలీసులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు కబడ్డీ క్రీడాకారుల మధ్య టీషర్టుల విషయంలో గొడవ చోటు చేసుకుంది. ఈ ఘటనలో విడిపించేందుకు వెళ్లి మాబు అనే యువకుడు గాయపడ్డాడు. అతని ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

ఉపాధి కూలీల హాజరు పక్కాగా నమోదు

బండిఆత్మకూరు: ఉపాధి హామి పథకంలో పని చేస్తున్న కూలీల హాజరును పక్కాగా నమోదు చేస్తున్నట్లు ఏపీవో నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీల హాజరులో అక్రమాలు జరగకుండా నేషనల్ మొబైల్ మానిటరీ సిస్టం(ఎన్ఎంఎంఎస్) యాప్ ద్వారా హాజరును వేస్తున్నట్లు తెలిపారు. ఇందులో కూలీకి పనికి వచ్చిన సమయంలో మొదటి సారి సెల్‌లో ఫొటో తీస్తారన్నారు. నాలుగు గంటల తర్వాత మరోసారి హాజరు వేస్తున్నట్లు వివరించారు.

వైభవంగా బాలాలయం పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల నేత శ్రీనివాసరెడ్డి

మహానంది: సీతారామాపురం గ్రామంలో వెలసిన పురాతనమైన శ్రీ కోదండరామ, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం బాలాలయం పూజలు వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, మండల వైఎస్సార్‌సీపీ యువనేత బుడ్డారెడ్డిగారి శ్రీనివాస రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు విశేష పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, బాలాలయం పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని మాట్లాడుతూ దేవదాయశాఖ ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయశాఖ రూ. 84.24లక్షలు మంజూరు చేసిందన్నారు. దీంతో పాటు గ్రామస్తుల సహకారంతో మరిన్ని నిధులు సేకరించి ఆలయాన్ని సుందరంగా నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ నాగప్రసాద్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామసుబ్బయ్య, శేఖర్‌రెడ్డి, వంగాల లక్ష్మీరెడ్డి, కందుల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ఉండాలి

పాములపాడు: డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకూడదని ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ జుబేర్ అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మలూరు గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ దృష్టికి సమస్యను తీసుకురాగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రూ.5లక్షలతో డ్రైనేజీ పనులు దాదాపు 100 మీటర్లు చేపట్టామని వివరించారు.

మద్దతు ధర పెంచాలి

మిడుతూరు: రైతులు పండించిన శనగలకు ప్రభుత్వం మద్దతు ధర పెంచాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారి పీరునాయక్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ శనగ సాగు చేపట్టిన రైతులకు ఏటేట పెట్టుబడులు పెరుగుతున్నాయని, ప్రభుత్వం అందించే మద్దతు ధర క్వింటాల్‌కు రూ, 5352 సరిపోదని, రూ. 8,000లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, నాగరాజు, మండల కార్యదర్శి ఓబులేసు, సీఐటీయూ తాలూకా కార్యదర్శి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇమ్మానుయేలు



ఇమ్మానుయేలును సన్మానిస్తున్న దృశ్యం

వెలుగోడు: స్పీడ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన లిటిల్ ఏంజిల్స్ స్కూల్ కరస్పాండెంట్ ఎంఎఫ్ ఇమ్మానుయేలు ఎన్నికయ్యారు. బుధవారం గుంటూరులో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన్ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రకటించారు. అనంతరం సంఘం సభ్యులు ఇమ్మానుయేలును సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో స్పీడ్ బాల్ క్రీడాకారులను తయారు చేయడంలో తన వంతు కృషి చేస్తానన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

మిడుతూరు: ఏపీ శాప్ చైర్మన్, యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని గురువారం మండల కేంద్రమైన మిడుతూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి బుధవారం తెలిపారు. అలాగే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు రక్తదాన శిబిరంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బస్టాండ్ ఆవరణ రోలర్‌తో చదును

సాక్షి ఎఫెక్ట్

ఆత్మకూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బిల్క్ వేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయంపై ఈ నెల 26న సాక్షి దినపత్రికలో 'బస్టాండ్ లో బిల్క్– ప్రయాణికులకు ఇక్కట్లు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. బుధవారం బిల్క్ పై రోలర్‌తో చదును చేయించారు. ఈ సందర్భంగా డీయం మహేంద్రుడు రోలర్ ద్వారా చదును చేసిన అనంతరం మెటల్ వేసి మళ్లీ సీసీ రోడ్లు వేస్తామని చెప్పారు.

పరిశోధనల్లో రాణించాలి

జూపాడుబంగ్లా: విద్యార్థులు శాస్త్రపరిశోధనా రంగాల్లో రాణించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్‌దినోత్సవ వేడుకలు నిర్వహించారు.